పేదపురుగులు కాటేస్తాయ్ ఖబడ్దార్!

భార్యా భర్తలే అయినా, వరలక్ష్మి సింగన్నల స్వభావాలు, ప్రవృత్తులు పరస్పర విరుద్ధాలు.

సింగన్నది పాతకాలపు పాలేరుబుద్ధి. పొగాకుతుంపుకోసం పాతిక కావిళ్ళ నీళ్ళ మోస్తాడు. అరకాయ సారాయి కోసం కామందులకు ఆరు నెలలు వెట్టిచాకిరిచేయ సిద్ధపడే ప్రవృత్తి. వాటికోసం కామందుల చుట్టూ కుక్కలా తిరుగుతాడు.

కుక్కలా చూచినా, అతడిని వూళ్ళో కామందులంతా "మంచి వాడని" "నమ్మకస్తు"డనే పొగుడుతుంటారు. విని వినీ ఆ పొగడ్తలకు బానిస అయిపోయాడు. వూరికే చాకిరిచేసి, వాళ్ళు దయతల్చి విదిలించే ఎంగిలి మెతుకుల్ని, పొగడ్తలనీ తింటూ బతుకు వెళ్ళతీయటం అలవాటు చేసుకొన్నాడు సింగన్న. అలా ఎప్పుడూ పెద్దవాళ్ళని ఆశ్రయించి బతుకు తుండటంవల్ల అతనికి లభించిన స్థిరాస్తి తాగుడు.

కాపురానికొచ్చిన కొద్దిరోజుల్లోనే మొగుడి "వూరికుక్క" బుద్ధిని, అతడిని వుపయోగించుకొంటున్న వాళ్ళ కుట్రని వరలక్ష్మి కనిపెట్టేసింది. ఆమెది చిన్నతనంనుంచి స్వేచ్ఛా ప్రవృత్తి తనమీద తనకు నమ్మకం జాస్తి. ఎవర్నీ లెక్కచేయని స్వభావం. డబ్బుకన్నా నీతిని గౌరవించే తత్వం.

మొదట్లో భర్తకు తిరుగుబాటు తత్వాన్ని బోధించబోయింది. ఊళ్లో కామందులు తెలివిగా అతడిశక్తిని ఎలా దోచుకొంటున్నారో వివరించింది. అయితే సింగన్న - భార్య వాళ్ళనుతిట్టేకొద్దీ - యింద్రులు, చంద్రులు అని పొగిడిపారేయటంతో, వరలక్ష్మికి కోపం వచ్చింది. సత్యాగ్రహాలు చేసి భర్తను లొంగతీసుకోవాలనుకొంది. కానీ అతడికి పెళ్ళాంకన్నా, ఆ" పేరా సైట్" బతుకే ముఖ్యమని తెల్సుకొన్నాక, వూరి పెద్దలు అతనికి చేసే అన్యాయాన్ని తలుచుకొని మండిపోయింది. ఊళ్ళో ఆసాములంటే అస హ్యం, కచ్చతో ఆమెగుండె నిండిపోయింది.

"మంచితనమంటే సేతకానితనం కాదర్రా. ఎర్రోడిని సేసి నీ కష్టాన్ని దోసిళ్ళతో దోసేత్తన్నారు. ఇంత మన్నుదిన్న మనిసివి - సీ - నువ్వూ వో మగాడివేనా?" అంటూ చీదరించుకొంటూనే ఏడ్చింది.

ఎలా తెల్సిందో ఏమో వరలక్ష్మి భర్తను "నువ్వూ వో మగాడి వేనా?" అన్నట్లు వూళ్ళో పెద్దలకు తెల్సి సింగన్నను ఎగతాళి పట్టించారు.

"ఏరా సింగాయ్. నీ కొత్తపెళ్ళాం నిన్ను కొజ్జావాడని అంది టగా?"

"కత్తిలాంటి పిల్లరోయ్ నీ పెళ్ళాం. కాస్త కనిపెట్టి వుండు."

మొగుడి అసమర్థతను, మంచితనాన్నీ, ఎన్ని సార్లు తిట్టినా, వరలక్ష్మికి సింగన్న మీద రోజురోజుకి ప్రేమా, జాలీ పెరిగాయేకాని వీస మంత ఎత్తు అసహ్యం కలగలేదు.

అతడిని మార్చాలి. తన సంసారాన్ని చక్కదిద్దుకోవాలి. ఇదీ ఆమె తాపత్రయం.

మొగుడుతెచ్చే ఎంగిలి మెతుకుల మీద ఆధారపడి బతకటం అస హ్యమనిపించింది. పొగాకు కోతలకు వెళ్ళింది. సింగన్న అదేమిటి అని అడగలేదు. పైగా, వూరివాళ్ళను ఆశ్రయించినట్లే భార్యనూ ఆశ్రయించి

అప్పుడప్పుడూ రూపాయీ అర్ధా పట్టుకెళ్ళి తాగటం ప్రారంభించాడు.

ఏరోజు కారోజు అతడికి డబ్బు యివ్వకూడదనుకునేది వరలక్ష్మి. కానీ అతను దీనంగా అడిగేసరికి బలహీనం ఆవహించేది. లొంగిపోయేది.

పొగాకు కోతలయ్యాక బేర్నులకు గ్రేడింగుకెళ్ళింది. ఆ తర్వాత మూడు మైళ్ళ దూరంలో వున్న పొగాకు కంపెనీలో కూలీకి వెళ్ళింది. మంచి పనిమంతురాలుగా అన్నిచోట్లా పేరు పొందింది.

పొగాకు సీజన్ అయిపోతే ఆప్రాంతాలలో కూలీలకు పని అంతగా వుండదు. సీజన్‌లో కుటుంబమంతా కష్టపడి సంపాదించిందాంతో కాలక్షేపం చేస్తారు కొందరు. మరికొందరు వరి నాట్లకు పనున్న ప్రాంతాలకు వలసలు పోతుంటారు.

వరలక్ష్మికి యీ రెండు మార్గాలు అసాధ్యమైనవే. సింగన్నను వూరు పోనివ్వదు. వరలక్ష్మి సంపాదించిందాన్ని అతడు మిగలనివ్వలేదు.

యిక మిగిలిన మూడో మార్గం దొంగతనం. ఆవూరి మాలపల్లెలో అలా బతికేవాళ్ళను వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. వాళ్ళని అందరికీ తెలుసు కనుక వోకంట కనిపెట్టేవుంటారు.

వరలక్ష్మి రక్తంలో దొంగ స్వభావం అణువులో ఆరుకోట్ల అంశమైనా లేదు. అంచేత ఆమె పనిలేని రోజుల్లో పొలం గట్లవెంబడి గడ్డి కోసేది. పేడకళ్ళు ఎత్తి పిడకలు చేసేది.

అయితే అది అసలే మెరకప్రాంతం. అందులో ఆఏడు వర్షాభావం. ఎంత గడ్డికోస్తే మోపు అయ్యేను ? పొట్ట సగమైనా నిండేను ?

ఆరోజు ఆమె పొలంగట్టున దోకుడుపారతో గడ్డి దోకుతున్నది. వర్షంలేని పొలంగట్టుమీద గడ్డిపోచలు పేదవాళ్ళ పొట్టల్లా, నేలను అతుక్కుపోయి వున్నాయి. దోకిదోకి వరలక్ష్మి చేతులు నొప్పులు పుట్టేయి. అలుపు వచ్చింది. అవతల చూస్తే అరమోపు గడ్డి కాలేదు. అమ్మితే వచ్చిన

డబ్బుల్తో ఏంకొనటం ? బియ్యం, వుల్లిపాయి, మిరపకాయి, చింతపండు, కట్టెపుల్లలు....

కట్టెపుల్లల ఆలోచన రాగానే వృధాభరితమై నీరసపడ్డ ఆమె మనస్సుకు ఎన్నడూలేని వో వూహ వచ్చింది.

అటు పొలం-యిటు పొలం ! ఎటు చూచినా ఎండిపోయిన పొగ వేళ్ళ గుట్టలే. గుప్పెడు పొగకట్టెలు తీసుకుపోతే కట్టెల ఖర్చు కల్సి రాదూ ?

వొకర్ని యాచించటం అసహ్యించుకొనే వరలక్ష్మి, తీవ్రమైన అభిప్రాయాలు కలదిగా, నిక్కచ్చి మనిషిగా, పనిమంతురాలిగా పేరుపడ్డ వరలక్ష్మి క్షణంసేపు అవసరానికి, ఆకలికి తల వంచింది.

గట్టుదిగి చేలో కాలుపెట్టింది. అల్లంత దూరంలో వున్న కొట్టం వైపు నడవసాగింది. ....

ఆ కొట్టం, దానిచుట్టు చాలామేరకు వున్న భూమి, ఆ వూళ్ళో చాలా పెద్దరైతుగా పేరుపడ్డ రాఘవయ్యది. ఆయనకు కొట్టంవైపు వచ్చే వ్యవధి వుండదు.

ఆ సమయంలో ఆయన ఏకైక పుత్రుడు కొష్టంలో నవారుమంచం పైన, మెత్తటి పరుపుమీద పడుకొని ఇంగ్లీషు నవలను చదువుతూ, మంచి రసఘట్టంలో మునిగివున్నాడు.

ఆతని పేరు మాధవ్.

రాఘవయ్య తండ్రి సామాన్యరైతు. అరక పట్టుకొని పొలం దున్నే వాడు. రాఘవయ్య హయాంలో ఆ అరకను మరొకరి మెడకుకట్టి, చన్నకోలు పుచ్చుకొని పైపై అజమాయిషీ చేసేదాకా వచ్చింది.

మాధవ్ తాత కష్టానికి, తండ్రి అజమాయిషీకికాని వారసుడుకాదు. వారిద్దరూ సంపాదించిన అపారమైన ఆస్తికి మాత్రం వొక్కగా నొక్క వారసుడు.

చన్నకోలు పుచ్చుకున్న దగ్గరినుంచి రాఘవయ్యకు అన్నీ గొప్ప గొప్ప ఆలోచనలే. కొడుకును కలెక్టరును చేయాలన్నది అందులో వొకటి.

"కలెక్టరు కారులో తిరుగుతాడు కాని అరక పట్టుకొని దున్నుతాట్రా ? మెత్తటి తివాచీలమీద నడుస్తాడుకాని మట్టిలో తిరుగుతాడా ?" అంటూ ఆయన మాధవ్‌ను చిన్నతనం నుంచి పొలం పనులకు దూరంగా పెంచేడు.

ఒకటోక్లాసు దగ్గర్నించి మాధవ్ చదువు పెద్ద పట్నాలలో, ఖరీదైన కాన్వెంట్ స్కూళ్ళలోనే. వయసుతోపాటు అతను చదివే క్లాసులు, క్లాసుల్తోపాటు అతని ఆలోచనలు, అలవాట్లూ, వూహలు పెరిగేయి. అతనిప్పుడు చదువుతున్న కాలేజీలో పెద్ద మేధావిగా పరిగణింపబడకపోయినా, అతను చాలారోజులుగా ఆ వూళ్ళో గొప్పవాడుగా, కాబోయే కలెక్టరుగా, వూరికి పేరు తెచ్చే "దొరబాబు"గా పరిగణింపబడ్తూనే వస్తున్నాడు. అతను ఎవరికీ అర్థంకానిరీతిలో యింగ్లీషులో మాట్లాడుతుంటే వినేవాళ్ళకు భయం వేస్తుంటుంది.

అతనింకా కాలేజీలో చదువుతున్నా కలెక్టరయిపోయినట్టె వూళ్ళో ప్రవర్తిస్తుంటాడు. కలెక్టర్ని ప్రజాసేవకుడిగా అతను వూహించుకోడు. పెద్ద చక్రవర్తి అన్న భావనే. అంచేత చక్రవర్తి అమ్మమొగుడంత హుందాగా అతను ప్రవర్తిస్తాడు. సాధారణంగా ఎవ్వరితో మాట్లాడడు. మాట్లాడితే ఇంగ్లీషులోనే. అతనికిప్పుడు తెలుగు తెల్సోలేదో చెప్పటం కష్టం.

ఆ సంవత్సరంతో అతని డిగ్రీ చదువు అయిపోతుంది. వెంటనే కలెక్టరు వుద్యోగంలో చేరిపోవాలా, లేక అమెరికాపోయొచ్చి కలెక్టరు ఉద్యోగంలో చేరటమా అన్న అనుమానం వచ్చిందతని కామధ్య. తండ్రికి రాస్తే ముందు కలెక్టరు వుద్యోగంలో చేరమని రాసేరు. అతనికి మాత్రం అమెరికాకి పోయొచ్చాక కలెక్టరవుదామని వుంది.

ఈ సమస్యను తేల్చిపారేసుకొంటేనే కాని అతనికి శాంతివుండదు. అంచేత ఏదో తెలవులిస్తే ఊరికొచ్చేడు. అయితే అతనికా వూరువస్తే ఏమీ తోచదు. నక్సలైట్ కాంపులో చిక్కబడ్డ పారిశ్రామికవేత్తలా గిజగిజలాడి పోతాడు.

అంచేత సాయంకాలంకాగానే అతను దర్జాగా యింగ్లీషు పుస్తకాలు పట్టుకొని పొలంపైపుపోవటం పరిపాటి. అతను ఊళ్ళోదిగగానే రాఘవయ్య కొట్టాన్ని ఫైవ్‌స్టార్ హోటల్‌లో రూమ్‌లా తయారు చేయిస్తాడు గొప్ప వాళ్ళ అలవాట్లు ఆయనకి తెల్సు కనుక ఆ ఏర్పాట్లుకూడా అవే జరిగి పోతాయి.

ఇప్పుడూ అలానే వచ్చాడు. నవల మాంచి రసవత్తర ఘట్టంలో వుండగా సూర్యుడు అస్తమించేశాడు. అక్షరాలు మసకకావడంతో చికాకు పడి లేచాడు పరుపుమీదినుంచి. పాలేరును కేకేయబోతూ వరలక్ష్మి రాకను గమనించాడు.

హీరోయిన్ హీరోని కాదనివెళ్తున్న ఘట్టంలో అతని నవలా పఠనానికి బ్రేక్ పడింది. ఇప్పుడా హీరోయిన్ తిరిగి వస్తున్నట్లు, తాను హీరో అయినట్లు క్షణకాలం భ్రమలోపడ్డాడు. వరలక్ష్మి నడకలో హీరోయిన్ నడకలో వయ్యారాలని ఊహించుకొంటూ ఆమె వలాగే చూస్తున్నాడు.

నిజానికి వరలక్ష్మి ఏ ఏంగిల్‌లో నుంచి చూచినాకూడా అందగత్తె అని చెప్పటానికి వీల్లేదు. అయితే అదేం చిత్రమో ! చిన్నతనంనుంచి సరైన తిండి బట్ట లేకపోయినా ఆమె అవయవాలన్నీ మంచి పొంకంగా ఆకర్షణీయంగా వుంటాయి.

రోజూ చూచేవాళ్ళకి ఆ ఆకర్షణ మోటుగా కన్పిస్తుంది. కాని సినిమాల్లో, పుస్తకాల్లో, రోడ్లమీద నాజూకు ఆడవాళ్ళని చూట్టానికి అలవాటు పడ్డ కళ్ళకు ఆమె మోటుతనమే గొప్ప ఆకర్షణ.

"బాబయ్యా పొయ్యిలోకి వోమోపు కట్టెలిప్పించండి...."

మాధవ్‌కు ఆమె మాటలు విన్పించాయో లేదో చెప్పటం కష్టం. అతను యింకా భ్రమలోనే వున్నాడు. అంచేత యింగ్లీషు నవల్లోని హీరోయిన్ పేరుతో ఆమెను పిలుస్తూ దగ్గరకు నడిచాడు.

ఇన్నాళ్ళయినా ఊళ్ళో వరలక్ష్మి దగ్గర ఎవరూ అలాంటి సాహసాలు చేయలేదు. మగాళ్ళంతా పవిత్రులయినారు. భయం కొంత. "కొన్నాళ్ళు చూద్దాం" అని కొంత.

"ఏంటి బాబయ్యా అట్టాసూ త్తరు? పొగకట్టెలడగతన్నా."

"డు యు వాంట్ మి టు కిస్!" అంటూ అతడామె భుజాలుపట్టుకొన్నాడు ఆవేశంతో.

మరోసమయంలో అవుతే చాచి చెంపపగలగొట్టేదే. కానీ మాధవ్ మాటలు, చేతలు, వేషం సినిమాల్లో మనుషులివిగా ఆమెకు చిత్రంగా వున్నాయి.

"వొంటిమీంచి సెయ్యి తియ్యండి ముందు" అంటూ అతడిచేతిని బలంగా విదిలించి కొట్టింది,

మాధవ్ అప్పటికి స్వాప్నిక స్థితి నుంచి బయట పడ్డాడు. ఇంగ్లీషు నవలలో హీరోయిన్‌లా కాకపోయినా, శరీర పొంకంతో ఆకర్షణీయంగా కన్పించింది వరలక్ష్మి. ఆకలిచావు చావడానికి సిద్ధంగా వున్నవాడికి, సిద్ధాన్నం కన్పించినట్లు ఆమె మీదికి వురకబోయాడు.

చెయ్యి కలుక్కుమంది. దాంతో ఆమె చేతిని విదిలించి కొట్టిందన్న స్పృహ వచ్చింది. అహం దెబ్బతింది. పరీక్షగా చూచాడామెను.

మురికిగుడ్డలు - మట్టిచేతులు చేతిలో దోకుడుపార - శరీరంనిండా ఆకలి కప్పుకొని వున్నది. గడ్డి దోక్కొనే మాలది!

"సీకటి పడిపోతన్నది. గుప్పెడు పొగాకు కట్టెలు....

యిప్పటికి మాధవ్‌కు దాని ఘోష అర్థమయింది. తోసేసిన చేతి

తోనే దాని శరీరంమీద మురికి బట్టల్ని వలిపించే మార్గం తోచింది.

ఊళ్ళో మోతుబరి తండ్రి - కాబోయే కలెక్టరు - అమెరికావెళ్ళే యువకుడు - వూళ్ళోవాళ్ళుచూపే భయం, గౌరవం - యీ భావాలన్నీ కల్సివచ్చి అతడి నెత్తినెక్కి స్వారి చేయసాగేయి.

"పొగాకు కట్టెలు కావాలంటే ? అలాగే యిస్తా. అయితే వాక్కొక్కట్ర ఖరీదు" ముద్దు నభినయం చేసేడు. "రాత్రంతా యిక్కడేవుంటే ఆ గుట్ట కట్టెలూ యిస్తా ఏమంటావ్ ?"

వరలక్ష్మి వెంటనే ఏమీ అనలేదు. కాని అతను యిందాకటి మనిషి కాదని మాత్రం గ్రహించింది.

"మాలముండా. ఎవరనుకున్నావేనన్ను ? నా చెయ్యి యిసిరికొట్టే దమ్మొచ్చిందా నీకు ? వుండు నీపనిచెప్తా.

అపుడతన్ని చూచినవాళ్ళకి రాఘవయ్య దాష్టీకం గుర్తుకొస్తుంది.

కానీ వరలక్ష్మికి తిరుగుబాటు గుర్తుకొచ్చింది. తన వ్యక్తిత్వాన్ని తడుముకొంది.

"నేను మాల్దాన్నేనండీ. అయితే నన్ను పట్టుకొన్న మువ్వెవడి వండీ ? వరలక్ష్మి సంగ తెలీదేంటి మనకు ?"

"స్టాప్" చిరాగ్గా అన్నాడు మాధవ్. "ఏంటే నీ సంగతి ముష్టి ముండా? మహా నీల్గుతున్నావు ? నా ముద్దు ఖరీదెంతో తెల్సా ? మూడు లక్షలు. నా ఖరీదెంతో తెల్సా ? ముప్పై లక్షలు.

అతనిలోని అహాన్ని ధనగర్వంకెక్కించ్చింది. మత్తెక్కిపోయింది. పేడపురుగును పట్టుకొన్నట్లు ఆమెను పట్టుకోబోయాడు.

పేడపురుగు పామై కాటేసింది. అతడి పళ్ళు కదిలేయి. బుసలు కొట్టే వంతు యిప్పుడు పేడపురుగుది.

"ముట్టి నంజాకొడకా. నీ దబ్బెంత సేసు ? నువ్వెంత సేసు ? నా

కట్టం ముందు నీ డబ్బంతా కలిపిన బలదూర్. నీ మొగానికి ముండలు కావల్సివచ్చారేం ? వరలచ్చిమి అంటే ఏటనుకొన్నావో ? ఆ పొగాకు గుట్టలో పడుకోబెట్టి కాల్చిపారేస్తా ఖబడ్దార్."

కలెక్టరుబాబుకు పళ్ళతోపాటు బుర్ర కూడా తిరిగిపోయింది. ఊళ్ళో తనంటే భయపడి గౌరవించే తన ఊళ్ళోవో మాలది-యిదేమిటి ? ఏ శతాబ్దం యిది ? ఎక్కడున్నాడు తాను ?

అతను కాస్తంత తేరుకునేసరికి వరలక్ష్మి గట్టుచేరి గడ్డిమోపు కట్టు కొంటోంది.

అహంకారం-పగలు అతనికి ధైర్యాన్నిచ్చాయి. పెద్దగా అరిచాడు.

"ఎవర్రా అక్కడ ? దానిదగ్గర ఆ గడ్డిమోపు లాక్కోండి. చేను గట్టుమీద గడ్డంతా కోసుకుపోతోంది. పట్టుకొని పెడరెక్కలిరిచి కట్టేయండి."

అప్పుడతన్ని చూచినవాళ్ళకు కలెక్టరు ఛాయ గుర్తురాదు. అనాదిగా వున్న భూస్వాములు, వాళ్ళు సృష్టించిన వ్యవస్థయొక్క ప్రతిబింబం గుర్తు కొస్తుంది.

తెలుగులోవున్న అతని కేకలకి చుట్టుపక్కల పొలాల్లోవాళ్ళంతా గుమిగూడేరు. కలెక్టరుగారి ఆజ్ఞల్ని సగం సగం అమలు జరిపే రెవిన్యూ యిన్స్పెక్టర్లలా అతని ఆదేశాలని అమలు జరిపేరు.

పగలస్తమానం కష్టపడి వరలక్ష్మి కోసిన గడ్డిపరకల్ని అతికష్టం మీద లాక్కోగలిగేరు. ఆమెను బతిమలాడి యింటికి పంపేసేరు.

"ఆ గడ్డిని గొడ్లకెయ్యండి. నో. నో. మాలముండ కోసిన గడ్డి - మన గొడ్లకెయ్యొద్దు. కాల్చి మసిచేయండి. ఏట్లో పారనూకండి."

నవనాగరికతను మేకప్ చేసుకొన్న భూస్వామి (మ్యా) రూపం అది !

....

....

తెల్లారేవరికి వూళ్ళోవాళ్ళు వరలక్ష్మి పేరుకు ముందు "దొంగ" అన్న బిరుదు తగిలించి మాట్లాడుకోసాగేరు. గొడ్లు పొలాలకెళ్ళే వేళకి వూరి వెట్టి, మున్సబుగారినుంచి కబురు తేనేతెచ్చేడు. పంచాయితీ.

సింగన్న భార్య చెప్పింది విని గజగజా వణికిపోయాడు.

పెద్దోళ్ళతో తగాదాలొద్దే దొంగతనం వొప్పేసుకో. అరి కాళ్ళా ఏళ్ళా పడి సిచ్చలేకుండా సెత్తా.

"నీ....మగాడివి కాదంట్రానువ్వు ? నీతి, నిజాయితీ, ధైర్యం వున్నోళ్ళు వొక్కమారేనత్తారు. నీలాంటి పిరికోళ్ళు పెతినిముసం సత్తూనే వుంటారు. మాలోళ్ళా మనుసులేనని ముక్కు గుద్ది సెప్పొద్దాం పదరా."

పంచాయితీలో జంకూ గొంకూ లేకుండా జరిగిన కథంతా చెప్పింది. కలెక్టరుబాబును కడిగిపారేసింది.

"యీ మాలముండకన్నా "రంభ" దొరక్కా ? దొంగముండ ఎన్ని అబద్దాలు చెప్తోందో చూడండి" రాఘవయ్య పళ్ళు పటపటా కొరికేడు.

"మున్సబుబాబూ ! తిట్టడం అరికేకాదు, నాకూ సేతవ్. కాతంత మరియాదగా ..."

మర్యాదలు నాకు నేర్పుతావంటే లం....

తెనీకపోతే నేరుపుతారా నం....

రాఘవయ్య గుండె బేర్నిలో రాక్షసిబొగ్గు అయింది. శరీరం బొగ్గుకాపలా కమిలిపోయింది. వరలక్ష్మి అంతగా తెగించినా మాట్లాడ లేదంటే మున్సబు మహిమ అది. ఆయనె లేకపోతే ఆక్షణంలో హత్యలు జరిగిపోయేవి.

మున్సబు భారీమనిషి. శరీరం, మనసు, గుణం, దాతృత్వం- అన్నీ భారీవే. మంచితనానికి మారుపేరు. కోపంవస్తే ప్రళయకాలరుద్రుడే.

అచ్చమయిన పెద్దమనిషిగా అతడిని వూరు ఏనాడో గుర్తించింది. అతని తీర్పులు నిక్కచ్చిగా, నిష్పక్షపాతంగా వుంటాయి. తీర్పు యిచ్చే ముందు బాగా ఆలోచిస్తాడు. యిచ్చాక ఊరి కది శాసనమే.

వరలక్ష్మి చెప్పినదంతా విన్నాక అతనికి ఆమె మాటమీద నమ్మకం ఏర్పడింది. అయితే అవతల సాక్ష్యం బలంగా వుంది. చదువూ, సంస్కారం వున్న మాధవ్ మాటల్నికూడా తేలిగ్గా కొట్టేయటానికి వీల్లేదు.

"మున్సబూ, తొందరగా తేల్చేయవయ్యా, దాన్తో నాకేంది ?"

"వరలక్ష్మీ నువ్వు చెప్పిందంతా నిజమనటానికి సాక్ష్యాలేమైనా వున్నాయా ?"

"బగమంతుడే సాచ్యం"

"అలాగంటే ఎలా ? పొగాకు కర్రలు నువ్వు దొంగిలిస్తుండగా చూచామని ముగ్గురు సాక్ష్యం చెప్పటానికి సిద్ధంగా వున్నారు."

"ఆ సాచ్చీక మేమిటో సూద్దాం. సెప్పమనండి"

ముగ్గురు మనుష్యులు తాము స్వయంగా చూచినట్లు సాక్ష్యంచేప్పేరు.

"మున్సబు బాబూ ! ఆళ్ళు మగా ? ఆడా ? నేక...."

"మున్సబూ ! అది కల్లుతాగినకోతయ్యా. కళ్ళు మూసుకుపోయి మాట్లాడుతోంది."

"నేపోతే ఏంటి బాబూ ! ఒక్క ఆడకూతురు ఆళ్ళ పొలాల్లో నుంచి పొగకట్టెలు దొంగిలించుకు పోతుంటే నలుగురు మగాళ్ళు సూత్తా నిలబడ్డారా ? ఆడే నన్ను పట్టుకొని నిలువునా సీల్చేయవచ్చునా !

పాయింటే మరి !

"సరేనండిబాబూ. దొంగతనం సేయలేదని నేను తలస్నానం సేసొచ్చి తడిబట్టల్తో ఆంజనేయస్వామి ముంగల పెమానికం సెత్తా. ఆ బాబులు నలుగురు కూడా అట్టాగే సేయమనండి సూద్దాం"

"పై సాయిస్తే పది ప్రమాణాలు, వొంద అబద్దాలు ! దాంతో ఏందయ్యామున్సబు. నువ్వే తేల్చేయి ముందు."

"ఏం తేల్చను బావా ? వరలక్ష్మి చెప్పిందే సబబుగావుంది. మన వూరు ఆచారంకూడా అదేగా ?"

అయితే మాధవ్ తడిగుడ్డల్తో ప్రమాణం చెయ్యాలంటావ్ ?

"మనిషి తీర్పుకు అలవికాని కేసుల్ని భగవంతుడి తీర్పుకు వది లేయటం ఆ వూళ్ళో ఆచారమేకాని, మున్సబుకి ఆ అవసరం ఎన్నడూ కలగలేదు.

"తప్పదు" - అది తీర్పు.

వరలక్ష్మి భగవంతుడినినమ్మి విశ్వాసంతో సిన్సియర్‌గా ప్రమాణం చేసింది. రాఘవయ్య అండ్ కో వాళ్ళకూ్కడా భగవంతుడిపైన విశ్వాసం వుంది. అయితే వాళ్ల దేముళ్ళకుదేముడు, కలియుగ ప్రత్యక్షదైవం అయిన తిరుపతి వెంకటేశ్వరస్వామికి లంచమిస్తామని మొక్కుకొన్నారు. యింకేం?

మంత్రిగారి అండ చూచుకొని ఆఫీసర్లు బాహాటంగా లంచాలు తీసు కొన్నట్లు, పెద్దదేముడి అండ చూచుకొని చిన్నదేముడిముందు ప్రమాణాలు చేసి బాహాటంగా బోలెడు అబద్దాలు చెప్పేరు.

ఆంజనేయస్వామి విగ్రహం వులకనూలేదు పలకనూ లేదు. తీర్పు యివ్వలేదు. అబద్దాలాడినవాళ్ళ తలల్ని నాలుగు వక్కలు చేయలేదు.

అంతటి ఆంజనేయస్వామి యివ్వలేని న్యాయాన్ని వరలక్ష్మికి మానవమాత్రుడు మున్సబు ఏమివ్వగలడు పాపం !

....

....

మర్నాటినుంచి "దొంగ వరలక్ష్మి"ని ఎవరూ పొలంగట్టు తొక్క నివ్వలేదు. గడ్డిదోకేవీలులేదు. మాలపల్లెలోకూడా వెలే.

"సింగన్నచేత పనిమాత్రం మామూలుగానే చేయించుకొంటున్నారు. అయితే ఎంగిలిమెతుకులు విదిలించటంలేదు. పైగా "నీకేరా? నీపెళ్ళాం వుందిగా?" అని పొగడసాగేరు. అలా రాఘవయ్య ప్రతీకారం, ఆకలి రూపంలో సింగన్న గుడిసెలో తిష్టవేసింది.

పొగాకు సీజన్ వచ్చింది. వెళ్ళింది. వరలక్ష్మికి మాత్రం ఎక్కడా కూలి చిక్కలేదు. సింగన్న కూలీకి సిద్దపడ్డా లాభంలేకపోయింది.

అప్పుడతనికి భార్య కొత్తల్లో చేసిన బోధనలు గుర్తుకొచ్చాయి.

"మరోవూరు దేనికైనా పోదామే"

"పోయి ?" సింగన్నదగ్గర జవాబు లేదు.

పిచ్చినాగన్నా లోకంలో డబ్బున్నవోళ్ళంతా వొక్కటే. ఏడికి బోయినా పేదోల్లబతుకులు పెత్తందారీలపేతల్లోనే వుంటాయి. పారి పోయినా ఆ రాఘవయ్య ఎంతబడడని ఏడుంది ? నిలబడి పోరాడాలి."

"అయితే ఏంసేద్దామంటావే ?"

వొక్కక్షణం ఆలోచించి దృఢస్వరంతో అంది వరలక్ష్మి.

"దొంగతనం"

సింగన్న భయంతో నీరుకారిపోలేదు.

"అవును. అదే మంచిమారగం" అన్నాడు ఆలోచనగా !

....

....

కాలేజీకి వెళ్ళేదన్నమాటేకాని మాధవ్ మనసులో పగ చల్లారలేదు. వరలక్ష్మి .. వరలక్ష్మి .... బలవంతంగానైనా సరే దాన్నోసారి అనుభవిస్తే కాని....

శెలవు లిస్తూనే యింటికొచ్చి వరలక్ష్మిని గురించి వాకబు చేశాడు.

"ఆ మాల్లంజ, దాని కొజ్జామొగుడు యిప్పుడు తెగించార్రా. పొలంలో పచ్చొకుని, ఎండుకట్టెల్ని, గొడ్డుగోదాముల్ని బతకనివ్వటంలేదు. సమయం కనిపెట్టి దాని పొగురుకు నేను ఆపరేషన్ చేస్తాలే. నక్సలైట్ అని యిద్దర్నీ బొక్కలో తోయిస్తే పీడ వదులుతుంది. నువ్వుమాత్రం దాని జోలికి పోకు.

తండ్రి హెచ్చరిక మాధవ్‌మీద పని చెయ్యలేదు. కోరిక ప్లస్ ప్రతీకారం అతడిని తొందర పెట్టింది. తన యీడు వాళ్ళతో తెలుగులో మాట్లాడడం ప్రారంభించి స్నేహాలు చేశాడు. పట్నవాసం కబుర్లుచెప్పి, ఆ మజాల రుచులు కాస్తకాస్త చూపించి మాయచేసేడు. కుర్రకారును చుట్టూ చేర్చుకొని యువనాయకుడయ్యాడు.

పొగాకు సీజన్ అయిపోయింది మళ్ళీ. అకును కంపెనీలకేసి, రైతులు స్వంత ఖర్చుల్తో డబ్బుకోసం కంపెనీలచుట్టూ తిరుగుతున్నారు. రాఘవయ్యకూడా ఆపనిమీదే వెళ్ళేడు. ఆ రాత్రికి రాడు.

మాధవ్ స్నేహితుల్తో సర్దాలు చేసుకుంటూ రాత్రిళ్ళు కొట్టంలోనే గడుపుతున్నాడు.

అర్ధరాత్రి యింకా కాలేదు. వూరు మాత్రం నిద్రపోయి చాలా సేపయింది. కొట్టంలో కల్లబ్బు వాతావరణం, స్నేహితులు మజామజాగా....

ఎద్దుల పాకలో గొడ్ల అరుపు. అంతలో ఎండుపొగాకు కట్టెల గలగల చప్పుడు.

మాధవ్ కళ్ళముందు వరలక్ష్మి బింబం ! పగ-కోరిక-ప్రతీకారం !

"ఒరేయ్, ఆ దొంగముండ వచ్చింది. పట్టుకొంటే యీ రాత్రికి మజా మజా. కాలాన్ని యీక్వల్‌గా షేర్ చేసుకొందాం. ఆల్‌రైట్."

నలుగురు నాలుగు వైపుల్నించి ముట్టడించారు

పొగకట్టెల్ని మోపుకట్టున్న వ్యక్తి ఎవరో వస్తున్న అలికిడి

కాగానే మోపు నెత్తుకొని పరుగెత్తేడు. నలుగురూ వొక్కసారి "దొంగ దొంగ" అని అరిచేరు. దొంగ గట్టు తట్టుకొని కిందపడ్డాడు. చుట్టుపక్కల కొట్టాల్లో జనమంతా చేరి దొంగను పట్టుకొన్నారు.

ఎవరో తెచ్చిన లాంతరు వెలుగులో దొంగమొహం చూచారంతా.

వరలక్ష్మి కాదు. సింగన్న !

....

....

వరలక్ష్మిని పట్టుకొంటే వోసర్దా చేసుకొందామనుకొన్నారు. సింగన్నను చూచాక మాధవ్‌కు మరో "సర్దా" చేద్దామన్న వూహ వచ్చింది.

"సర్దా" అని మాధవ్ స్నేహితుల్తో చెప్పిన ఆ ఆలోచన వెనుక ప్రతీకారం వుంది. అంటరానివాళ్ళుగా పరిగణింపబడుతున్న ఆ వర్గంపై తరతరాలుగా పెంచుకొన్న మిగతా ముగ్గురు స్నేహితులకి సులభంగానే నచ్చింది.

ఎవరో వూళ్ళోకెళ్ళి "దొంగచిక్కేడ"ని చెప్పి జనాన్ని పోగేసుకొచ్చారు. మరి కొందరు వెళ్ళి పెట్రోమాక్సు లైట్లు, డప్పులవాళ్ళను, మంగలిని, గాడిదతోసహా చాకలిని పిల్చుకొచ్చారు.

యిదంతా చూసేసరికి సింగన్న ధైర్యం కొండెక్కింది

"తప్పయిపోయింది బాబయ్యా ! ఇంకెప్పుడూ సేయను. నన్ను కాపాడండి నాయన్లారా" ప్రాధేయపడ్డాడు.

"యిన్నాళ్ళు దొంగిలించినవి కక్కుతావట్రా ?"

"దొంగకూడు తింటున్నప్పుడు తియ్యగా వుందికాదురా నా కొడకా. యిప్పుడు చూడరా అసలు తీపి."

వాళ్ళనీ వీళ్ళనీ ప్రాధేయపడి లాభం లేదనుకొన్నాడేమో. మాధవ్ కాళ్ళు పట్టుకొన్నాడు. ఎలాగైనా దొరబాబు దొరబాబేనని వాడి భ్రమ !

"ఒరేయ్. అట్లాగే వదిలేస్తాంగాని వో పని చేస్తావురా ?"

"సెప్పండి దొరా"

"నీపెళ్ళాం-అదే-ఆరోజు అంత నీలిగి గొడవచేసిందే-ఆ లంజనో సారి యిక్కడికి పిలిపించు. యీరాత్రి యిక్కడ మాదగ్గర...."

"బాబూ...."

సింగన్న చెంప చెళ్ళుమంది !

"కోపంవచ్చిందిట్రా కొజ్జాలంజాకొడకా ? నీ పెళ్ళాం పతివ్రతగా వుండాలి. మా సొమ్ము నూక్కోపోతుండాలి. మేము ఏమీ అనకూడదు. వూళ్ళో నీపెళ్ళామేకాదురా హీరోయిన్. మేమేం గాజులు తొడిగించుకో లేదు.

మాధవ్ ఆరాత్రి జరగబోయేకొలుపులకి ప్రారంభోత్సవం చేశాడు. చెప్పెట్లు కొట్టేరు. డబ్బులు మోగేయి. మంగలి సింగన్న తలని గుండు చేశాడు. చాకలి గుండును సున్నంతో, పసుపుకుంకుమలతో అలంకరించాడు. రెక్కల్ని విరిచికట్టేరు. వేపమండల్తో అలంకరించబడ్డ గాడిదమీద వెనుక ముఖంచేసి కూర్చోబెట్టేరు. అంతా అయ్యాక ఎవరో వచ్చి సింగన్న గుడ్డల్ని పీకిపారేశాడు.

ఎటుచూచినా అరుపులు, సంతోషంతో కేరింతలు, కేకలు, పశుత్వం.

డప్పులశబ్దం లయబద్ధంగా వుద్రేకాన్ని రెచ్చకొడ్తోంది.

అర్ధరాత్రి అకస్మాత్తుగా వచ్చిన ఈ సంబరధ్వానికి వూరు వులిక్కిపడి లేచింది. పెట్రోమాక్సులైట్ల వెలుగులో కొలుపులసందడి పొలాల్ని వదిలి గ్రామప్రవేశం చేసింది. తలుపులుతెర్చుకొంటున్నాయి. జనం బయటికొచ్చి సంబరాన్ని చూ స్తున్నారు.

అందరిదృష్టి సెంట్రల్‌పాయింటు మీదే. ఆ సెంట్రల్‌పాయింట్ దేముడుకాదు. దేవతకాదు. దయ్యంకాదు.

మనిషి ! అనాదిమనిషి ! అణగదొక్కబడ్డ మనిషి ! వుక్కు చట్రాల్లో బంధింపబడ్డ మనిషి ! దిగంబరుడైన మనిషి ! మనిషి మనిషే మనిషి ! !

అకస్మాత్తుగా వీరంగం ఆగిపోయింది.

వరలక్ష్మి పూనకంవచ్చినదానిలా అరుస్తూ కొలుపుల మధ్య వుంది. సింగన్ననుచూడగానే వుద్రేకం చల్లారి ఏడుపొచ్చింది. ఏడుస్తూ కట్లువిప్ప బోతే ఎవరో వెనక్కిలాగిపట్టుకొన్నారు.

ద ...ద... ధ ధ ధ ధ.... శ్శరభ శ్శరభో శరభ !

వరలక్ష్మి పట్టుకొన్నవాళ్ళని విదిలించికొట్టింది. వీరవిహారంచేస్తూ మాధవ్ ముందుకొచ్చింది.

"ధూ !" కాండ్రించి వుమ్మేసింది. సిగ్గులేదురా నీకు ? మగాడి వైతే నామీద పగ తీర్చుకోరాదె. అది సేతగాక అమాయకుడు ఆడి మీదనా తీర్సకంటున్నావ్ ?"

మాధవ్‌కు తల కొట్టేసినట్లయింది. అహం పొంగింది.

"కొజ్జాలంజకొడుకు, బికారిలంజకొడుకు, దొంగనాకొడుకు. వాడి మీద నాకు పగేమిటి ! ఎంట్రుకముక్క వాడూ, నువ్వూ. డబ్బుపారేస్తే నీలాంటి లంజలు వందలు....వేలు....! ఆ కొజ్జాలంజకొడుక్కి పెళ్ళాన్ని అదుపులోపెట్టటం చాతకాక నీకింత పొగరొచ్చింది. నా దగ్గరికొస్తే కొమ్ములుతీస్తా. దా దావే."

నవ్వులు ! చప్పట్లు ! కేకలు ! ఓహోలు ! ఆహాలు ! ఇహి హీలు !

ఆ గంద్రగోళంలో వరలక్ష్మి అన్నదేమిటో ఎవరూ విన్పించుకో లేదు. జనోత్సాహం అరుస్తున్న వరలక్ష్మిని వెనక్కినెట్టేసి ముందుకు సాగి పోయి మునసబుగారింటిముందు ఆగిపోయింది.

మునసబు ఆ సాయంకాలం చివరిబస్సుకి బస్తీకెళ్ళేడు. రెండ్రోజులు ల్దాకారాడు. మాధవ్ వుత్సాహం తాత్కాలికంగా కప్పబడింది. ఆరోజు తన అభియోగానికి యివాళ మున్సబుకు ప్రత్యక్షసాక్ష్యం చూపాలనుకొన్నాడు. ముద్దాయి సిద్ధం - న్యాయమూర్తిలేడు.

అంతలోనే అతనికి ఆంజనేయస్వామి గుర్తుకొచ్చాడు. మున్సబు అంతటివాడు తీర్పివ్వలేక చివరికి ఆశ్రయించింది ఆయన్నేగా ? ముద్దాయీ ఆరోజు ఆరాతినే ఆశ్రయించింది. యివాళ తనూ ఆరాతినే ముద్దాయికి శిక్ష విధించమంటే ?

జనం వుత్సాహంగా గుడిదగ్గరికి నడిచేరు. పూజారినిలేపి గుడి తలుపులు తీయించారు.

"స్వామీ ! వీడుచేసిన నేరం యిప్పటికే వూరంతా తెల్సింది. దేముడివి కనుక నీ కెప్పుడో తెల్సుండాలి. వీడు, వీడి పెళ్ళాం పచ్చిదొంగలు. పచ్చటి పొలాన్ని ధ్వంసంచేసే విషక్రిములు. ఎండుకట్టెలైనా మిగిలించని పరమకిరాతకులు. మా పొలంలో రాత్రి దొంగతనం చేస్తుండగా పట్టుకొన్నాం. అడుగో దొంగ. వాడు దొంగిలించిన పొగాకు కట్టెలమోపు వాడి దగ్గరే వుంది. వీడి కిప్పు డేశిక్ష విధించాలో చెప్పు స్వామీ."

స్వామి మాట్లాడలేదు.

"పోనియ్ స్వామీ. శిక్ష నేను చెప్తాను. నువ్వు ఆశీర్వదించు"

జనం అలాగే నన్నట్లు చప్పట్లు కొట్టేరు.

"వీడి నేరానికి శిక్ష - స్వామి ఎదుట సజీవదహనం"

దేముడు ఆశీర్వదించాడో లేదో కాని జనం మాత్రం వెర్రి వుత్సాహంతో అరిచారు. యీలలు వేశారు. తప్పెట్లు కొట్టేరు.

సింగన్నను గాడిదమీద నుంచి పొగపేళ్ళతోసహా దింపి, దేముడి ఎదుట దిగంబరంగా నిలబెట్టేరు. గర్భగుడిలోని దీపం ప్రమిదను తీసుకొచ్చారు. దేముడు చీకట్లో కళ్ళు మూసుకొన్నాడు.

సింగన్నకు నూనెతో తడపిన గుడ్డల్ని కట్టేరు. దీపం ప్రమిదతో గుడ్డల్ని వెలిగించబోతున్నారు.

వరలక్ష్మి హఠాత్తుగా మాధవ్ ముందు ప్రత్యక్షమయింది. ఒక చేతిలో దోకుడుపార, మరో చేతిలో కొడవలి. అర్థనగ్నంకాదు - దాదాపు పూర్తి నగ్నమూర్తి."

పోలేరమ్మా, అంకాళమ్మలను చూచినట్లు బెదిరేడు మాధవ్.

"ఒరేయ్ నా మొగుడు కొజ్జా. నువ్వు ముండలు కావల్సిన మగాడివి. యిప్పుడు సూపించరా నీ మగతనం. నా మొగుడి బట్టలిప్పటంకాదు. నీ బట్టలిప్పు. మూడంకె లనేలోగా యిప్పాలి మగాడివైతే. నేకపోతే...."

ఒకటి - రెండు - జనం గుళ్ళో దేముడిలా గుడ్లప్పగించి చూస్తున్నారు. శక్తి స్వరూపిణిలా వరలక్ష్మి వుద్రేకంతో ఊగిపోతోంది.

"మూడు" వూరి కడుపును చీల్చుకొని వచ్చినట్లుందా కేక !

ఆ రెండక్షరాలతోపాటే కొడవలి పైకిలేచి కిందికి వాలింది.

రక్తం - కొడవలంతా రక్తం.

కాని మాధవ్ మెడ తెగలేదు, గుండెకొట్టుకోటం మానలేదు. ఐతే బీజాలుతీసేసిన ఆంబోతులా గిలగిల్లాడిపోతున్నాడు.

వరలక్ష్మికూడా అప్పటిగ్గాని ఏంజరిగిందో తెలియలేదు. తెల్సేక కాళికలా నవ్వింది.

"నీకన్నా, నాకన్నా యీ కొడవలి తెలివయిందిరా నీలాంటివోడి మెడ కోసి నాబమేటి? మగాడివనికదూ యిర్రయీగావ్. యిప్పుడుసూసుకో.

"మాలోళ్ళం, బీదోళ్ళమనేగా నా మొగుణ్ని కొజ్జాను, నన్ను నంజను సేసేవ్. యిప్పుడు నువ్వు కొజ్జావి. డబ్బుపెట్టి పెళ్ళాన్ని కొన్నా ఎదవముండే అది. యిక పోయి నీ డబ్బుని వాటేసుకుపడుకో పో—"

రక్తసిక్తమైన కొడవలితో మొగుడి బంధాలని కోసిపారేసింది. యిద్దరూ చెయ్యీ చెయ్యీ పట్టుకొని వెళ్తున్నారు.

అప్పుడు తెలివొచ్చింది జనానికి. పట్టుకోబోయారు.

అయితే ముందుకాలాన్ని పట్టుకోటం ఎవరితరం ?

భవిష్యత్తును బంధించడం ఎవరికి సాధ్యం ?!

"స్వాతి" జూలై 1978